క్లుప్తంగా

ఆకట్టుకున్న వీధినాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లలో శ్రీ రేణుక ఎల్లమ్మ వీధినాటకాన్ని మంగళవారం రాత్రి ప్రదర్శించారు. గ్రామానికి చెందిన నాటకోపాధ్యాయుడు గంజిపల్లి పెద్ద రామయ్య ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ వరకు రోజు విడిచి రోజు ఈ వీధి నాటక ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. గ్రామంలోని 30మంది పాత్రదారులు గ్రామ పెద్దల సహకారంతో ఈ వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. హార్మోనియం మిట్టకోడూర్ హన్మయ్య పంతులు, తబల బాబయ్య, మేకప్, డ్రెసింగ్, లైటింగ్, సౌండ్ చౌదర్‌పల్లికి చెందిన మధుకృష్ణ డ్రామా కంపెనీ అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



హోమం చేస్తున్న సుధాకర్‌రెడ్డి దంపతులు

అనంతగిరి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయంలో సహస్ర కళాశాభిషేకం మహోత్సవం పురస్కరించుకుని ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా సుధాకర్‌రెడ్డి దంపతులు గోపూజ, అవహిత దేవత పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి అనంతరం అన్నదానం చేశారు. బుధవారం కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక సందేశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేతాజీ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మధ్యాహ్న సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు వారివారి అభిప్రాయాలను వివరించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంత గౌరవప్రదమైందో, సమాజంలో ఆ వృత్తికున్న ప్రాముఖ్యత గురించి అభిప్రాయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, మల్లప్ప, అభయ్‌కుమార్, రాములు, ముకుంద రెడ్డి, సాయిబాయి, మాధవి పాల్గొన్నారు.

నేడు చౌడాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలో పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి బుధవారం పర్యటిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం మల్కాపూర్ గ్రామంలో బీటీరోడ్డు ప్రారంభోత్సవం, బంగ్రంపల్లిలో బీటీరోడ్డు శంకుస్థాపన, మరికల్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కమిటీ హాల్ శంకుస్థాపన, కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రైతులు సంఘటితం కావాలి



షాబాద్: రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరించి, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని సూచించారు. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణయ్య, పెంటయ్య, ఒగ్గు మల్లయ్య, బీర్ల చెన్నయ్య, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగులపల్లి చెన్నయ్య, కుమార్, పెంటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- కొలిచిన వారికి కొంగు బంగారంగా ఎల్లకొండ ఆలయం
- పార్వతీ పరమేశ్వరులు వెయ్యేళ్ల క్రితం కొలువుదీరారని ప్రతీతి
- వారం రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలు



వెండికొండలో వెలసిన పార్వతీ పరమేశ్వరుల ముఖద్వారం (ఫైల్)

నవాబుపేట: మండల పరిధిలోని ఎల్లకొండ పార్వతీపరమేశ్వరుల ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతియేటా మహాశివరాత్రి అనంతరం ఆలయ ఉత్సవాలను ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తారు. దీనికోసం సుదూర ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

ఆలయ ప్రాముఖ్యత..

ఎల్లకొండలోని పార్వతీపరమేశ్వరుల ఆలయం, శిథిలావస్థలో ఉన్న శంభుని ఆలయాలు పురాతన కట్టడాలు, శిల్పాలు, జైన మతానికి చెందినవిగా పూర్వీకులు చెబుతున్నారు. ఇక్కడి కట్టడాలు, శిల్పశైలి రీత్యా ఈ ఆలయాలు సుమారు 9, 10వ శతాబ్ద కాలంలో నిర్మించినట్లు పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు. ఎటు చూసినా పచ్చని పంట పొలాలు ఆహ్లాదకరమైన వాతావరణం. గుట్టపై పార్వతీ పరమేశ్వరులు వెయ్యేళ్ల క్రితం కొలువు దీరారని చెబుతుంటారు. ఈ ఆలయంలో గ్రామస్తులు, భక్తులు సహస్రా ఘటాభిషేకం (వెయ్యి కడవల నీటితో లింగానికి అభిషేకం) చేస్తే వర్షాలు కురుస్తాయని అనుభవ పూర్వకంగా గ్రామస్తులు చెబుతున్నారు.

కొలిచిన వారికి కొంగు బంగారం..

ఎల్లకొండ గుట్టపై వెలసిన పార్వతీ పరమేశ్వరులను కొలిచిన వారి కోరికలు తీర్చే కొంగు బంగారంగా నిలుస్తుంది. నిత్యం వందల సంఖ్యలో భక్తులు పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్న వారికి వారి కోరికలు తప్పక నెరవేరుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం.

ప్రతిఏటా బ్రహ్మోత్సవాలు..

ప్రతీ సంవత్సరం మహా శివరాత్రి అనంతరం ఎల్లకొండలో ఘనంగా పార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు సంగారెడ్డి, పటాన్‌చెర్వు, జహీరాబాద్, వికారాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, తాండూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.

ఇలా రావాలి..

ఎల్లకొండ గ్రామం మీదుగా శంకర్‌పల్లి నుంచి వికారాబాద్, వికారాబాద్ నుంచి ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. శంకర్‌పల్లి, నవాబుపేట, వికారాబాద్‌కు ఆటోలు నడుస్తాయి.



పార్వతీ పరమేశ్వరుల ఆలయం

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు..

ఉత్సవాలకు కొన్ని వేలా మంది భక్తులు వస్తారు. అందుకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. వారం రోజుల పాటు నిత్యం 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు.

– ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

మండల విద్యాధికారి గోపాల్



దోమ: మెట్టుగడ్డ తండా పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్



పరిగి: మాట్లాడుతున్న మండల విద్యాధికారి గోపాల్

పరిగి: పదోతరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నధమవుతున్నారని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. పరీక్ష సమయం దగ్గర పడుతుందని పరీక్షలపై ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. కష్టపడి చదివే వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగడ్డతండాలో..

దోమ: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందజేస్తున్నారని ఎంఈఓ వెంకట్ అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని మెట్టుగడ్డ తండా పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి ఒక్కొక్క విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు బోర్డుపై రాయించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ధారళంగా చదువుతూ బోర్డుపై అక్షరాలను రాయడంతో ప్రధానోపాధ్యాయులు సత్యానారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్‌ను ఎంఈఓ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మరింత మెరుగైన విద్య నేర్చుకునేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి ఆంగ్లం, తెలుగు చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్పించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్, పరీక్షల ఫలితాలు, హోంవర్క్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారి సామర్థ్యాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తూ చదువు పట్ల నిర్లక్ష్యం చూపొదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజ మార్గం

కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి



తాండూరు రూరల్: రాజీ మార్గమే రాజ మార్గమని, వివాదాలను చక్కదిద్దుకోవడానికి లోక్ అదాలత్ అద్భుతమైన అవకాశమని ఎస్ఐ విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో 75 కేసులు రాజీచేసుకునేవిధంగా ఉన్నాయన్నారు. ఉచిత న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీ వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటిని వృథా చేయొద్దు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్వప్న

కొడంగల్ రూరల్: నీటిని వృథా చేయొద్దని లెర్నింగ్ కర్వ్ సీఓఓ స్వప్న సూచించారు. బుధవారం పట్టణ శివారులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో లెర్నింగ్ కర్వ్, బీపీసీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 'ప్రాజెక్టు తృప్తి' పేరుతో కొడంగల్ కేజీబీవీ, కుల్కచర్ల కేజీబీవీ, తాండూరు కేజీబీవీ, వికారాబాద్ కేజీబీవీల్లో నీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసోషియేట్ తులసి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, దేవి, ఆశ, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



చెక్కు అందజేస్తున్న శివకుమార్ తదితరులు

బీజేపీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలంటూ బీజేపీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కోట్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో పదోతరగతిలో గతేడాది ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.2,500 చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేశ్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో పట్లూర్ గ్రామంలోని బీసీ కాలనీలో ఉపాధిహామీ పథకం కింద రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులతో పాటు ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట నాయకులు రాములు యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, మాజీ ఎంపీటీసీలు సురేశ్, మహేశ్, కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగేశ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

కేజీబీవీ హాస్టల్ భవనాన్ని పరిశీలించిన ఎంఈఓ చంద్రప్ప



పనులను పరిశీలిస్తున్న చంద్రప్ప

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్‌గేట్ సమీపంలో నిర్మిస్తున్న కేజీబీవీ హాస్టల్ భవనాన్ని ఎంఈఓ చంద్రప్ప మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సైట్ ఇంజనీర్ కిశోర్‌కు సూచించారు. 24 గదులతో చక్కటి భవన నిర్మాణం జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. 300 మంది విద్యార్థులు ఉండేలా అన్ని వసతులతో హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తుందన్నారు. మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

ఎంపీడీఓ కరీం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరీం

పరిగి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఎంపీడీఓ కరీం సూచించారు. బుధవారం మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్, సొండేపూర్, రంపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల నిర్వహణ, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రతీరోజు వారి కార్యక్రమాలను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతీరోజు మొక్కలకు నీటిని అందించాలని, షిఫ్టింగ్, గ్రేడింగ్ చేసి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను నిర్వహించాలని ప్రతిఒక్కరికీ పనులను కల్పించాలని, ప్రతీగ్రామం నుంచి వంద మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను తప్పకుండా అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, డ్రగ్స్, కొకైన్ హానికరం

ధారూరు ఎస్ఐ అనిత



మాట్లాడుతున్న ఎస్ఐ అనిత

ధారూరు: మాదకద్రవ్యాలు, డ్రగ్స్, కొకైన్ హానికరమని ధారూరు ఎస్ఐ అనిత పేర్కొన్నారు. నిషేధ వస్తువులను ఎవరైనా సేవించినా, విక్రయించినా శిక్షార్హులని తెలిపారు. ఛింతకుంట గ్రామంలో సోమవారం రాత్రి పోలీస్ కళాబృందంచే ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపొద్దని, వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్లో మాట్లాడితే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరంగా పరిగణిస్తామని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు సహించరానివన్నారు. మానవ అక్రమ రవాణా చేస్తున్నారని తెలిస్తే 1098కు కాల్ చేయాలని, నేరాల అదుపునకు 100కు, మహిళలపై వేధింపులకు షీటీం 181 సమాచారం అందజేయాలని ఎస్ఐ అనిత తెలిపారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా పలు వీడియోలను ప్రదర్శించి చైతన్యం కల్పించారు.

నిరుద్యోగులు స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి



మొబైల్ షాపును ప్రారంభిస్తున్న మహేందర్ రెడ్డి

మర్పల్లి: నిరుద్యోగులు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. కల్‌ఖోడ గ్రామానికి చెందిన మహ్మద్ జాబేర్, మహ్మద్ ఓవైసీ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్టార్ మొబైల్ షాప్‌ను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆయా వ్యాపారాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకులు రాములు యాదవ్, మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ మండల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులకు షాపు యజమానులు శాలువా కప్పి సన్మానించారు.

నేడు మట్టి నమూనాల సేకరణ

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్‌లో బుధవారం రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తారని ఏఈఓ సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు పొలాల్లో సేకరించిన మట్టి నమూనాల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. సేకరించిన మట్టి నమూనాలను రాజేంద్రనగర్‌లోని భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తారని తెలిపారు. రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మట్టి నమూనాలను తీసుకురావాలని ఆయన కోరారు.

పూడూరు: రైతులు యాసంగిలో వేసిన పంటలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి తులసిరాం తెలిపారు. మండల పరిధిలోని రైతు వేదికల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేయించుకోవాలని, లేకుంటే పంట విక్రయ సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పంటలు నమోదు చేయించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర పొందొచ్చని సూచించారు.

ప్రశ్నించే గొంతుకగా తపస్



పీఆర్టీయూ నాయకుల సంబరాలు

తపస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



తాండూరు టౌన్: తపస్ ఆధ్వర్యంలో విజయోత్సవ బైకు ర్యాలీ

తాండూరు టౌన్: మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తపస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపొందడం హర్షణీయమని పలువురు తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తపస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య విజయోత్సవ సంబరాల్లో భాగంగా మంగళవారం తాండూరు పట్టణంలో తపస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకం జాతీయవాదం వైపు మొగ్గు చూపుతున్నారని, మండలిలో ఉపాధ్యాయ సమస్యలను ఎలుగెత్తి చాటుతారనే నమ్మకంతో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందం, రాములు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో...

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి పింగలి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించడంతో మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వెంకట్‌రాం రెడ్డి, జైపాల్ రెడ్డి, వినోద్, పురుషోత్తం రెడ్డి, నవీన్, వెంకట్ రెడ్డి, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలవడంతో పీఆర్టీయూ సంబరాలు

పరిగి: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా విజయం సాధించడంతో పట్టణ కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. పీఆర్టీయూ అంటేనే ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పోరాడే సంఘమని, విద్యారంగా సమస్యలపై పోరాటం చేసిన ఘనత పీఆర్టీయూకే దక్కుతుందని సంఘం నాయకులు పేర్కొన్నారు. శ్రీపాల్‌రెడ్డి నిత్యం సమస్యల పరిష్కారానికి అహర్నిషలు శ్రమించిన వ్యక్తని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.